మహనీయుల సేవలు మరువలేం..

మాట్లాడుతున్న వినాయకరావు దేశ్‌పాండే

కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 6 : మహనీయులు దేశానికి అందించిన సేవలు మరువలేమని వీహెచ్‌పీ నాయకులు అన్నారు. కామారెడ్డి జిల్లా విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శనివారం కామారెడ్డిలోపి వశిష్ట డిగ్రీ కళాశాలలో 'సామాజిక సమరసత' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా వినాయకరావు దేశ్‌పాండే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్, జ్యోతిబాపూలే లాంటి మహనుభావులు దేశానికి చేసిన సేవ గురించి వివరించారు. దేశంలో కులాలకతీతంగా హిందువులందరూ ఏకతాటిపై రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని అన్నారు.

నేడు ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

కామారెడ్డి, ఏప్రిల్ 4 : తెలంగాణ ఆదర్శ పాఠశాలల 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఈ నెల 7 వ తేదీ (ఆదివారం) ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7వ నుంచి 10 వ తరగతి వరకు మిగిలిన ఖాళీల సీట్ల భర్తీ కోసం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలోని అన్ని ఆదర్శ పాఠశాలతోపాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సదాశివనగర్‌లో నిర్వహిస్తున్నట్లు డీఈవో రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష సామగ్రితోపాటు పరీక్షా కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని తెలిపారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

సదాశివనగర్, ఏప్రిల్ 6 : మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షను మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆదివారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ భానుమతి శనివారం తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. ఉదయం 10 నుండి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, మొత్తం 536 మంది అభ్యర్థులకు మూడు సెంటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సదాశివనగర్ మోడల్ పాఠశాలలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

రోడ్డును బాగు చేయండి

- గాయాలపాలవుతున్న వాహనదారులు
- చోద్యం చూస్తున్న అధికారులు

రాజంపేట్, ఏప్రిల్ 6 : మండల కేంద్రం మీదుగా మెదక్ వెళ్లే రోడ్డును బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. అధికారులకు పలుమార్లు మొరపెట్టుకోగా రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నెల క్రితం కంకర వేశారు. కానీ.. తారు వేయడం మరిచారు. వేసిన కంకర తేలడంతో అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నామని ద్విచక్ర వాహనదారులు అంటున్నారు. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోని బస్వన్నపల్లి, ఆర్గొండ, కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి, గుండారం, సిద్దాపూర్ గ్రామాల మీదుగా ఉన్న రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతల్లో పడి వాహనదారులు గాయాలపాలై ప్రాణాలమీదకి తెచ్చుకుంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పెద్దాయిపల్లి గేటు వద్ద కంకర తేలిన రోడ్డు

బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో వేంకటేశ్వర స్వామిని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి శనివారం దర్శించుకొని పూజలు చేశారు. – నస్రుల్లాబాద్, ఏప్రిల్ 6

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

కామారెడ్డి, ఏప్రిల్ 4 : తెలంగాణ రాష్ట్ర సేవాధికార సంస్థ సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కామారెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ సోమవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎన్.శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రక్తదాన శిబిరం అడ్వకేట్ సొసైటీ హాల్ కామారెడ్డిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ అధికారులు, న్యాయవాదులు, పోలీసు యంత్రాంగం, కోర్టు స్టాఫ్, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ వివరాలను జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థల సూపరింటెండెంట్ చంద్రసేన్‌రెడ్డిని సంప్రదించాలని తెలిపారు. లేదా 9951251999 ఫోన్ నంబర్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు.

కుల బహిష్కరణపై చేసిన పలువురిపై కేసు నమోదు

భిక్కనూరు, ఏప్రిల్ 6: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన పలువురిపై కుల బహిష్కరణ కింద కేసు నమోదు చేశారు. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నిజాంపేట లలిత (ఎస్సీ) కుటుంబాన్ని ఓ పెండ్లి విషయంలో అదే కులానికి చెందిన పెద్దలు కుల బహిష్కరణ చేశారు. గత నెల లలిత భర్త అనారోగ్యంతో మృతిచెందగా.. అంత్యక్రియలకు కూడా సంఘ సభ్యులెవరూ హాజరుకాలేదు. కుల బహిష్కరణ చేసిన వారితోపాటు తమను బెదిరింపులకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని లలిత ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణ తార

కామారెడ్డి/బీబీపేట్/ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 6 : జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు అరుణతార శనివారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీజేపీ జాతీయ భావం పెంపొందించే ఉద్దేశంతో ఏర్పడిందని, దేశ, ధర్మం కోసం నిరంతరం తపించేవారు బీజేపీలో పని చేస్తున్నారని అన్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బీబీపేట్‌తోపాటు ఆయా గ్రామాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిసి బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో బీజేపీ ఆవిర్భావ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బూత్ అధ్యక్షుడు నర్సారెడ్డి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించిన అనంతరం పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను బైఠక్‌లో వివరించారు. మండల అధ్యక్షుడు నర్సింహులు, నాయకులు పాల్గొన్నారు.

దళితబంధు పథకం ఇవ్వాలి

భిక్కనూరు, ఏప్రిల్ 6 : దళిత బంధు పథకం ఇవ్వకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అడ్డుకుంటామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పొట్టిగిని శంకర్ అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దళితుల అభ్యున్నతి కోసం దళిత బంధు పథకం ప్రవేశపెడితే, కాంగ్రెస్ ప్రభుత్వం మేం గెలిస్తే రూ.12 లక్షల దళిత బంధు పథకం ఇస్తామని అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్‌ను అడ్డుకుంటామని, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రామస్వామి, నియోజకవర్గ ఇన్‌చార్జి చందు, రమేశ్, రాజు, పోచిరాం, రవి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆలయానికి విరాళం

మాచారెడ్డి, ఏప్రిల్ 6 : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నర్సింహాస్వామి ఆలయానికి భూంపల్లికి చెందిన ఇదులాయి సాయిరెడ్డి, గోదావరి దంపతులు నర్సింహాస్వామి యాగశాల నిర్మాణానికి రూ.రెండు లక్షల ఆరువై వేల పదకొండు రూపాయలను విరాళంగా ఆలయ అధికారులకు శనివారం అందజేశారు.

ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధికారులు దాతను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఈవో శ్రీధర్‌రావు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

దీక్షకు తరలిన బీఆర్ఎస్ నాయకులు

బీబీపేట్, ఏప్రిల్ 6 : జిల్లా కేంద్రంలో రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షకు బీబీపేట్‌తో పాటు ఆయా గ్రామాల నుంచి నాయకులు శనివారం తరలి వెళ్లారు. కామారెడ్డిలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా నిర్వహించిన దీక్షలో పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం

భిక్కనూరు, ఏప్రిల్ 6 : మండల కేంద్రంలోని ఎస్‌వీ గార్డెన్‌లో భిక్కనూరు, రాజంపేట మండలాల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఉదయం 10 నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, కామారెడ్డి నియోజక వర్గ ఇన్‌చార్జి, మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ హాజరవుతారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నేడు సన్నాహక సమావేశం

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 6 : మండల కేంద్రంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న వెంకటసాయి పాఠశాలలో బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలకు సంబంధించి బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

దోమకొండ, ఏప్రిల్ 6 : జిల్లా ఎస్పీ సింధూశర్మ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ సీఐ తిరుపయ్య, సిబ్బందితో కలిసి దోమకొండలోని ప్రశాంత్ రైస్ మిల్లును శనివారం తనిఖీ చేశారు. కస్పా ప్రశాంత్ అనే వ్యక్తి అక్రమంగా నిల్వ ఉంచిన 17 బస్తాల పీడీఎఫ్ బియ్యం(సుమారు 11 క్వింటళ్లు), మూడు టీవీఎస్ ఎక్సెల్ మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 6: ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంసాగర్ మండలం మల్లూర్‌కు చెందిన పెద్ది గంగాధర్ కామారెడ్డి పట్టణానికి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని గండి మాసానిపేట్ శివారు మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గంగాధర్ తీవ్రంగా గాయపడగా ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానలో ప్రథమచికిత్స అందించారు. అనంతరం నిజామాబాద్‌కు తరలించినట్లు సమాచారం.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 6: మండలంలోని భిక్నూర్ గ్రామంలోని ఆలయంలో బాలహనుమాన్, శివపంచాయతన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుడు కొండంబొట్ల రాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు కొనసాగాయి. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు.

జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

బిచ్కుంద, ఏప్రిల్ 6: మండలకేంద్రలోని ఎస్సీవాడ ప్రాథమిక పాఠశాలలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి హెచ్ఎం శివకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు.

బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

బీఆర్ఎస్ ప్రచార రథాలు సిద్ధం

లోక్‌సభ ఎన్నికల కోసం బీఆర్ఎస్ ప్రచార రథాలు సిద్ధమయ్యాయి. జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ప్రచారం చేసేందుకు రెండు రథాలను మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి జాజాల సురేందర్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, వెల్లుట్ల సొసైటీల చైర్మన్లు ఏగుల నర్సింహులు, పటేల్ సాయిలు, నాయకులు కపిల్‌రెడ్డి, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

–ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 6

పురాతన కట్టడాలను కాపాడుకోవాలి

నాగన్నబావి పూడికతీతలో శ్రమదానం చేసిన కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 6: పురాతన కట్టడాలను కాపాడుకోవాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. లింగంపేట్ మండల కేంద్రంలోని నాగన్న బావిలో శనివారం పూడికతీత కార్యక్రమం చేపట్టగా మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ, ఐకేపీ సిబ్బందితో కలిసి రెండు గంటల పాటు ఆయన శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నాగన్నబావిలో పేరుకుపోయిన పూడికను తొలగిస్తే పెద్దమొత్తంలో నీరు నిల్వ ఉండడంతో పాటు చుట్టుపక్కల భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. అనంతరం బావి పరిసరాల్లో మొక్కలు నాటారు. శ్రమదానం చేసిన యువకులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేశ్, తహసీల్దార్ నరేందర్, ఏపీఎం శ్రీనివాస్, ఏపీవో అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

స్థానికులతో కలిసి పురాతన బావి పూడికతీత పనుల్లో పాల్గొన్న కలెక్టర్

ఎన్నికల విధులపై సంపూర్ణ అవగాహన అవసరం

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 6: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదర్ పోలింగ్ ఆఫీసర్లకు శనివారం ఒక్కరోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మన్నె ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా శిక్షణలో నివృత్తి చేసుకోవాలని సూచించారు. ట్రైనర్లు ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు విడుతలుగా నిర్వహించిన శిబిరంలో 841 మంది ఓపీవోలు పాల్గొనగా, వారి నుంచి పోస్టల్‌బ్యాలెట్ కోసం దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అల్లం మహేందర్, శిక్షకులు పాల్గొన్నారు.

ఓపీవోలకు సూచనలిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

విద్యుత్ స్తంభాలు తొలిగించాలి

సదాశివనగర్, ఏప్రిల్ 6 : మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో కొత్తగా చేపట్టిన రోడ్డు విస్తరణ పనులకు అడ్డుగా ఉన్న కరెంట్ పోల్స్‌ను తొలగించాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరారు. శనివారం గ్రామానికి వచ్చిన విద్యుత్‌శాఖ ఎస్ఈకి వినతి పత్రం అందజేయగా, త్వరలోనే స్తంభాలను తొలగిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పైడి జానకీ జనార్దన్ యాదవ్, విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి, నాయకులు మహ్మద్ ఇర్షాదోద్దీన్, శేకెల్లి బాల్‌రాజు, కాలమోల్ల ఆశోక్, ఆకుల సిద్దిరాములు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సైబర్ అంబాసిడర్లతో పోలీస్ సిబ్బంది

మద్నూర్, ఏప్రిల్ 5: మండలంలోని మేనూర్ ఆదర్శ పాఠశాలలో సైబర్ నేరాలు, షీ టీంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు. సైబర్ అంబాసిడర్లుగా ఎంపికచేసిన విద్యార్థులకు కానిస్టేబుల్ విఠల్ బ్యాడ్జిలు, సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, రామేశ్వరి, కావేరి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పిట్లం, ఏప్రిల్ 6: నర్సరీల్లో పెంచే మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో కమలాకర్ ఆదేశించారు. మండలంలోని రాంపూర్ నర్సరీని శనివారం పరిశీలించి, పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు చేశారు. ఎండ నుంచి రక్షణగా గ్రీన్ నెట్ ఏర్పాటుచేయాలని, మొక్కలకు రెండు పూటలా నీరందించాలన్నారు. ఆయన వెంట ఎంపీవో బ్రహ్మం, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఫీల్డ్ అసిస్టెంట్ అంజాగౌడ్ ఉన్నారు.

హనుమాన్ మాలధారుల పాదయాత్ర

పాదయాత్రగా బయల్దేరిన మాలధారులు

పిట్లం, ఏప్రిల్ 6: మండలంలోని అల్లాపూర్ గ్రామానికి చెందిన హనుమాన్ మాలధారులు సంగారెడ్డి జిల్లాలోని వేంపల్లి హనుమాన్ ఆలయానికి శనివారం పాదయాత్ర చేపట్టారు. గ్రామంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం చేస్తూ బయల్దేరారు.

రెండు గ్రామాల్లో దొంగల హల్‌చల్

తాళాలు వేసిన ఆరు ఇండ్లల్లో చోరీ..

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 6: లింగంపేట్ మండలంలోని పర్మళ్ల, శెట్పల్లి గ్రామాల్లో దొంగలు శుక్రవారం అర్ధరాత్రి హల్‌చల్‌చేశారు. తాళాలు వేసిన మొత్తం ఆరిండ్లల్లో చోరీ చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పర్మళ్ల గ్రామానికి చెందిన ఈర్ల రాజు, ఈర్ల గణేశ్ కుటుంబాలు ఇండ్లకు తాళాలు వేసి డాబాపై పడుకోగా దుండగులు ఇండ్లల్లోకి చొరబడ్డారు. ఈర్ల గణేశ్‌కు చెందిన రూ. 20వేల నగదు, 50 తులాల వెండి, 14 గ్రాముల ఆభరణాలు, రాజుకు చెందిన రూ. 10వేల నగదు, నాలుగు గ్రాముల బంగారం చోరీ చేశారు. అదే గ్రామానికి చెందిన రాజిరెడ్డిగారి అంజిరెడ్డి, వెంకట్‌రెడ్డి కుటుంబాలు బంధువుల వద్దకు వెళ్లగా తాళాలు ధ్వంసంచేసి దొంగతనానికి పాల్పడ్డారు. వెంకట్‌రెడ్డి ఇంటి నుంచి రూ.15వేల నగదు, అంజిరెడ్డి ఇంటి నుంచి వెండి పట్టగొలుసులను ఎత్తుకెళ్లారు. శెట్పల్లి గ్రామానికి చెందిన గంగారాం ఇంట్లో రూ. 30 తులాల వెండి పట్టగొలుసులను చోరీ చేశారు. కంట్రపల్లి సాయన్న ఇంట్లో సొత్తు లభించకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు చోరీ జరిగిన ఇండ్లను శనివారం పరిశీలించారు. క్లూస్ టీం ద్వారా వేలిముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED TEACHERS

★WANTED TEACHERS to teach all subjects from Nursery to X Std E/M Pri-primary 8,000/- to 12,000/- Primary 10,000/- to 14,000/- Upper Primary 11,000/- to 18,000/- High School 15,000/- to 28,000/- Principal 25,000/- 35,000/- Cont:**Liberty High School,** old NGO Colony, Nizamabad, Cell:7993552268
NTZ-324542

CHANGE OF NAME

★I, **METTU NARSAIAH S/o. METTU POSHANNA** H.No.1-53/A, issapally, Armoor, (D) Nzb. Changed My name as **METTU NARESH**
NTZ-324640

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్ 200/- మాత్రమే.
" పేరు మార్పిడి " ప్రకటన 4 లైన్లకు 250/-
GST వర్తించును
సెల్: 91827 77590

WANTED

★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.
NT-311882-All

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311821-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన లీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.